అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్


అన్నానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. అన్నా నగర్‌లో మంగళవారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఆరు నుంచి పది రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతోందని, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. హైదరాబాద్ జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న పలువురు క్రీడాకారులు, కోచ్‌లు ఎమ్మెల్యేను కలిశారు. జింఖానా మైదానంలో వసతులు, క్రీడా మైదానాల అభివృద్ధి తదితర అంశాలను ఎమ్మెల్యేకు సుధాకర్ వివరించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిక్కులే..

- బేగంపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ తిప్పలు
- ప్రస్తుత రద్దీకి సరిపోని ఫ్లై ఓవర్లు
- ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై దృష్టి ఏదీ?


బేగంపేట రహదారిలో నెలకొన్న ట్రాఫిక్

సనత్‌నగర్: వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారుల అభివృద్ధి జరగడం లేదు. రోడ్ల మీదకు వచ్చే వాహనాల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నాయి. అయినా రహదారుల విస్తరణ మాత్రం జరగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ సమయంలోనూ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఇక చినుకు పడిందంటే చాలు.. ట్రాఫిక్ చిక్కులు నిత్యకృత్యంగా మారింది. ఈ పరిస్థితి బేగంపేట ప్రధాన రహదారిలో సర్వసాధారణమైంది.

ఎన్నాళ్లీ తిప్పలు..

బేగంపేట రహదారి అంటేనే వాహనదారులు జంకాల్సిన పరిస్థితి ఉంది. వామ్మో..బేగంపేట అనే పరిస్థితి నెలకొంది. సికింద్రాబాద్, హైదరాబాద్‌లను కలిపే ప్రధాన రహదారి బేంగపేట. ప్రధానంగా ఢిల్లీతో పాటు ఏపీ, ఇతర రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే వీఐపీలు ఎక్కువగా బేగంపేట విమానాశ్రయాన్నే ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో సాధారణంగానే ఈ రహదారి రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక వీఐపీలు వస్తున్నారంటే ముందుగానే ఇతర వాహనాలను నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఒక్క నిమిషం ట్రాఫిక్ ఆగినా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతాయి. ఆ ట్రాఫిక్ ప్రభావం కొన్ని గంటల పాటు ఉంటుంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు కూడా నానా కష్టాలు పడాల్సిందే. వారంలో కనీసం మూడు, నాలుగు సార్లు వీఐపీ మూవ్‌మెంట్ ఉండాల్సిందే. ఇక ఇదిలా ఉంటే వర్షాకాలంలో బేగంపేట ప్రధాన రహదారిలో ప్రయాణం అంటే సాహసంతో కూడుకున్నదనే చెప్పాలి. ఎందుకంటే చినుకు పడిందంటే చాలు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచి నరకం అంటే ఏమిటో వాహనదారులు చవిచూస్తున్నారు. అటు సికింద్రాబాద్ వైపు నుంచి బేగంపేట మీదుగా అమీర్‌పేట, పంజగుట్ట, బల్కంపేట, సనత్‌నగర్ వైపు వెళ్లే వాహనాలు, ఇటు సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలతో ఎప్పుడు చూసినా రద్దీగానే కనిపిస్తుంది. ఈ రహదారిలో ఫ్లై ఓవర్లు ఉన్నా ప్రస్తుత రవాణా అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ముఖ్యంగా బేగంపేట పీ అండ్ టీ ఫ్లైఓవర్ వద్ద, రసూల్ పురా మెట్రో స్టేషన్ వద్ద ఒకవైపు మెట్రో పిల్లర్లు రోడ్డు మధ్యలో ఉండడం, మరోవైపు బాటిల్ నెక్‌ను తలపించేలా ఉండడంతో ఇక్కడకు వచ్చేసరికి వాహనాల వేగం ఒక్కసారిగా కుంటుపడుతుంది. ఆ ప్రభావంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయే పరిస్థితులకు దారితీస్తోంది. ఇక ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే మాత్రం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి ఏదీ..

వాహనదారుల అవసరాలను ఇక్కడ ఫ్లై ఓవర్లు, రహదారులు తీర్చలేకపోతున్నాయి. వర్షం పడినప్పుడు, లేక వీఐపీల తాకిడి ఎక్కువైనప్పుడు మాత్రమే కాకుండా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఈ క్రమంలో పలు ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డ మీదుగా గతంలో రోడ్డును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అది ప్రతిపాదనలకే పరిమితమైందే తప్పా పట్టాలు ఎక్కలేదు. ఈ మార్గంలో ఫ్లై ఓవర్ నిర్మించడం ద్వారా పంజగుట్ట వైపు వెళ్లే వాహనదారులకు సులువవడంతో పాటు బేగంపేట రహదారిపై ఒత్తిడి తగ్గుతుంది. దీంతో పాటు పలు ప్రత్యామ్నాయ రహదారులను అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోనాల జాతర నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- బీఆర్ఎస్‌తోనే బోనాలకు గుర్తింపు
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సనత్‌నగర్: బోనాల నిర్వహణకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం నియోజకవర్గ పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులు రెండు రోజుల్లోగా దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆషాఢ బోనాల ఉత్సవాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అన్ని దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించిందని తెలిపారు.

కోదాడ కిట్స్ కాలేజీ పై జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు



ఉస్మానియా యూనివర్సిటీ: సూర్యాపేట జిల్లా కోదాడ కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యంపై జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం టీఎస్ జాక్, ఓయూ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి నాయక్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావును కలిసి కళాశాల యాజమాన్యం అక్రమాలను వివరించారు. ఫోర్జరీ ధ్రువపత్రాలతో పొందిన కళాశాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. జేఎన్‌టీయూ అధికారులచే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో శివరాత్రి ప్రశాంత్, తూము నవీన్ యాదవ్, లక్ష్మీనాయక్, తాడెం రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి అందజేస్తున్న డీఐఓఎస్, సంస్థ సభ్యులు

చిలకలగూడ: విద్యార్థులు ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మారేడుపల్లి మండల పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐఓఎస్) మదన మోహన్‌రెడ్డి అన్నారు. చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో వైర్స్ అండ్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీ సామగ్రి, బిస్కెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఐఓఎస్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ ప్రిన్స్, జనరల్ సెక్రటరీ సుధాకర్, హెచ్ఎం మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, నాగశృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేస్తున్న జేఎస్‌టీ సాయి

సనత్‌నగర్: సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ సాయి మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం 18 డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న హుడా పార్కుల్లోకి రుసుము లేకుండా అనుమతించాలన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం అక్టోబర్ 1న బెస్ట్ సీనియర్ సిటిజన్స్‌ను గుర్తించి అవార్డులను ప్రదానం చేయాలని కోరారు.

ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి


మాట్లాడుతున్న నెల్లి సత్య

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వర్సిటీ గ్రంథాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రూప్–2, 3 పోస్టుల సంఖ్యను పెంచి పరీక్షలు నిర్వహించాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 46, 317ల సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్యార నరేష్, నెల్లి సత్య, భగత్, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతు బజారులో కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి. టమాట రూ.55, నల్ల వంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 52, పందిరి బీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 21, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 28, దోసకాయ 23, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 35, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 35, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్‌గా కృష్ణ

నేడు ప్రమాణ స్వీకారం



చిలకలగూడ: ఎట్టకేలకు పదేళ్ల తర్వాత చిలకలగూడ కట్ట మైసమ్మ నల్లపోచమ్మ ఆలయ ధర్మకర్తల కమిటీని ఏర్పాటు చేస్తూ దేవదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జులై 28, 29 తేదీల్లో బోనాల జాతర సందర్భంగా కమిటీ చైర్మన్‌గా గుంటి కృష్ణ, సభ్యులుగా మినుముల అమృత్, జంగిలి దేవేందర్‌యాదవ్, ఎం.జగన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ ముదిరాజ్, సుదల జానకీ, కేబీ ధరమ్‌వీర్, ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేస్తు ఆదేశాలు జారీ అయ్యాయి. బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నూతన ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ తెలిపారు.

కుట్టు మిషన్ల అందజేత


కుట్టు మిషన్ అందజేస్తున్న కత్తుల సుదర్శన్‌రావు

బౌద్ధనగర్ : పార్శిగుట్ట పద్మశాలి మహిళా కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలు బైరి అమరావతి ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సొసైటీ మహిళా అధ్యక్షురాలు పోరండ్ల శారద జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్‌రావు చేతుల మీదుగా ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్న దేవదాసు, వనం దుష్యంతుల, గుంటక రూప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాల పరిధిలో నీట్ నిర్వహించాలి


ఓయూలో మాట్లాడుతున్న మేడి పాపయ్య

ఉస్మానియా యూనివర్సిటీ : రాష్ట్రాల పరిధిలో నీట్ పరీక్షను నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో నీట్ వల్ల అవకతవకల కారణంగా పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. నీట్–2024లో జరిగిన మార్కుల అక్రమాలు ఇంత వరకు ఎన్నడూ జరగలేదన్నారు. గతంతో మార్కులను పోల్చుకొని చూస్తే 2023లో ఇద్దరికి 720 మార్కులు రాగా 2022లో ముగ్గురికి, 2021లో ఇద్దరికి, 2020లో కేవలం ఒక్కరికే 720 మార్కులు రాగా, నీట్–2024లో ఏకంగా 67 మంది 720 మార్కులు రావడం అక్రమాలకు నిదర్శనమన్నారు. మార్కుల అక్రమాలలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన కార్పొరేట్ విద్యా సంస్థల హస్తం ఉందన్నారు. నీట్ పై దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. నీట్‌లో అక్రమాలకు బాధ్యత వహిస్తు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మంచిర్యాల యాదగిరి, ఈరెంటి విజయ్‌మాదిగ, డా.మేడి రమణ, బాబు మాదిగ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి


ప్రొ. కోదండరాంను కలిసిన వడ్డె ఎల్లన్న

లాలాపేట: మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమైన తమ లాంటి ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని ఓయూ జేఏసీ చైర్మన్ వడ్డె ఎల్లన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తార్నాకలో ప్రొ కోదండరాంను ఆయన నివాసంలో కలిసి ఉద్యమకారుల స్థితిగతులపై చర్చించారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు ఉద్యమంలో అగ్రభాగాన ఉండి పోరాటాలు చేశారని వివరించారు.

వీపీ సింగ్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ : మాజీ ప్రధాని, దివంగత నాయకుడు వీపీ సింగ్ 93వ జయంతిని విద్యార్థి నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కార్యక్రమంలో వీపీ సింగ్ చిత్ర పటానికి పలువురు విద్యార్థి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించిన గొప్ప నేత అని స్మరించుకున్నారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


వీపీ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ప్రభుత్వ దృష్టికి ఆర్పీఎఫ్ పెన్షనర్ల సమస్యలు


సమావేశంలో పాల్గొన్న ఆర్పీఎఫ్ పెన్షనర్లు

చిలకలగూడ: రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. చిలకలగూడలోని సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వరప్రసాదరెడ్డి నేతృత్వంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ (పీఏఆర్) అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమాచార్యులు, రాఘవరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ కార్డు అప్‌గ్రేడేషన్ (యుఎంఐడీ కార్డు), నేషనల్ పెన్షనర్స్ బ్యాంకు అకౌంట్ అంశాలపై అవగాహన కల్పించారు. ఎనభై ఏళ్లు దాటిన పెన్షనర్లను సన్మానించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాలు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ రైల్వే జనరల్ సెక్రటరీ విద్యాసాగర్, ట్రెజరర్ బీకే సింగ్, జనరల్ సెక్రటరీ జీవీఎస్ రాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, అంసా, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట వారు మాట్లాడుతూ.. సమస్యలపై నిరసన తెలిపిన నేతలపై సస్పెన్షన్ విధించడం సరి కాదన్నారు. వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, వీసీని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూర్తి, రవి , సత్య, శ్రీకాంత్, మల్సూర్, సైదులు పాల్గొన్నారు.

ప్రొ. వినోద్‌కుమార్‌కు విద్యారత్న జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట : న్యాయవిద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి అంతర్జాతీయ స్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీ ఖ్యాతిని పెంచిన లా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ కృషిని ఇంటర్ నేషనల్ ఇన్సానియత్‌కి కిద్‌మత్ సొసైటీ అంతర్జాతీయ సంస్థ గుర్తించింది. విద్యారత్న 2024 జాతీయ అవార్డును అందజేసి సత్కరించింది. ఈ మేరకు సోమవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా గాలి వినోద్‌కుమార్‌ను సన్మానించి విద్యారత్న అవార్డు, సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ అత్యున్నత విశ్వవిద్యాలయాలైన కొలంబియా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డు, ఆక్స్‌ఫర్డు యూనివర్సిటీలలో అంతర్జాతీయ సదస్సుల వేదికపై పరిశోధనా పత్రాలను సమర్పించానని ఆయన వివరించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, మానవ హక్కులు, కుల వివక్షత, భారత రాజ్యాంగం అనే అంశాలపై అనేక దేశాల్లో ప్రసంగాలు చేశానని తెలిపారు.

సమాజానికి హాని కలిగిస్తే సహించబోం


కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ జగన్, సీఐ కరుణాకర్‌రెడ్డి

అడ్డగుట్ట: సమాజానికి హాని కలిగించే చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఓయూ ఏసీపీ జగన్ హెచ్చరించారు. మంగళవారం లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో నేరాల నియంత్రణకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పూర్తి స్థాయిలో నిఘా పెంచినట్లు తెలిపారు. అర్ధరాత్రుల్లో అనవసరంగా రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా 11 గంటల తరువాత దుకాణాలు మూసివేయాలని, లేదంటే కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎట్టిపరిస్థితుల్లో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు.

32 రౌడీషీటర్లు, 34 సస్పెక్ట్‌లు..

లాలాగూడ పీఎస్ పరిధిలో 32 మంది రౌడీషీటర్లు, 34 మంది సస్పెక్ట్‌లు ఉన్నట్లు తెలిపారు. ఈ రౌడీ షీటర్లలో 17 మంది మర్డర్ కేసుల్లో ఉన్నారని వెల్లడించారు. ఈస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో అధికంగా రౌడీ షీటర్లు ఉన్న పోలీస్ స్టేషన్‌లలో లాలాగూడ ఒకటని తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్‌లు ఎటువంటి కేసుల్లో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. సమావేశంలో లాలాగూడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎస్ఐలు షాహీద్‌పాషా, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి ఆలయ ఉత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజేశ్వరీదేవి అమ్మవారి అష్టాదశ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. వందలాది మంది భక్తుల పూజలతో ఈ నెల 23వ తేదీన ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ వేద పండితులు స్వాగతం పలికి సత్కరించారు. శాంతి పాఠము, ప్రాతఃకాల పూజలు, మండప దేవత హోమాలు, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. దేవాలయాన్ని మహిళల స్వయం కృషితో ఎంతో అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ సభ్యులు విజయలక్ష్మి, రాజేశ్వరి, అరుణ, అన్నపూర్ణ, రుక్మిణి, కాంగ్రెస్ నాయకులు శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి


చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ శ్రేణులతో కలిసి మంగళవారం పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి సరైన మార్గం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, పాఠశాల భవనం పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుందన్నారు. హెచ్ఎం మల్లికార్జునరెడ్డితో పలు అంశాలపై చర్చించారు. పాఠశాల దుస్థితి గురించి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమురెల్లి బాబు, యాదగిరి, చందర్, గౌరీ, నాగరాజు, శ్రీహరి, భిక్షపతి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీవీఎల్ వైద్యులు

గాంధీ ఆస్పత్రి : బొల్లి మచ్చలు అంటు వ్యాధి కాదని, వంశపారంపర్యంగా రాదని, నియంత్రణకు అవకాశం ఉన్న చర్మవ్యాధి మాత్రమేనని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డీవీఎల్ వైద్యులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ బొల్లి నివారణ(విటిలిగో డే) దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ ఆస్పత్రి డెర్మటాలజీ, వెనిరాలజీ, లెప్రసీ హెచ్ఓడీ ప్రొఫెసర్ సుధారాణి నేతృత్వంలో మంగళవారం ఆస్పత్రి ప్రాంగణంలో ప్లకార్డులు ప్రదర్శించి చైతన్య ర్యాలీ నిర్వహించిన అనంతరం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ.. బొల్లి మచ్చలను మొదటి దశలో గుర్తిస్తే నియంత్రణ సులభమన్నారు. బొల్లితో మానసిక, శారీరక, వైవాహిక జీవితానికి ఎటువంటి ఆటంకం లేదని వివరించారు. గాంధీ ఓపీ విభాగంలో ప్రతి శుక్రవారం విటిలిగో క్లినిక్ అందుబాటులో ఉంటుందని, ఫొటోథెరపీ, టాపికల్, సిస్టమిక్ తదితర అత్యాధునిక చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీవీఎల్ అసోసియేట్ ప్రొఫెసర్ రఘుకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రవీణ్, శంకర్, సత్తయ్య, సౌమ్య, శాంభవి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అడ్డగుట్ట: శాంతినగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో అనుమతులు లేకుండా అదనంగా నిర్మించిన మూడంతస్తులను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మంగళవారం కూల్చివేసింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత మాట్లాడుతూ.. శాంతి నగర్‌లో ఇది వరకు నిర్మించిన నాలుగు అంతస్తుల భవనంపై అదనంగా మరో మూడంతస్తుల నిర్మాణం చేపట్టారని తెలిపారు. నోటీసులు ఇచ్చినప్పటికీ ఇంటి యజమాని నుంచి సమాధానం లేకపోవడంతో కూల్చి వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి సరిత, ప్లానర్స్ ప్రకాష్, మౌనిక, చైన్‌మెన్ నాగయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థి నేతలను ఆసుపత్రికి తరలింపు

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగుల కోసం ఆమరణ దీక్ష చేస్తున్న విద్యార్థుల ఆరోగ్యం క్షీణించింది. దీంతో మంగళవారం ఓయూ పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ఆమరణ దీక్షను వీడేది లేదని విద్యార్థి నాయకులు మోతీలాల్ తెలిపారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.